# బాధిత కుటుంబానికి అండగా జాన్సన్ నాయక్



పెంబి: కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

పెంబి, మే 3 : హైదరాబాద్‌లో ఎప్‌సెట్ పరీక్ష రాసి కారులో తిరుగు ప్రయాణంలో లోతర్యతండా గ్రామానికి చెందిన బానవత్ అశ్విని, మంజులలు జాతీయ రహదారి జక్రాన్‌పల్లిలో రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెలు శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ శుక్రవారం అర్ధరాత్రి ఆర్మూర్ ప్రభుత్వ దవాఖానకు చేరుకొని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అర్ధరాత్రి నుంచి జాన్సన్ నాయక్ సహాయ సహకారాలు అందిస్తూ వైద్యులు, పోలీసులతో మాట్లాడి మృతదేహాలు స్వగ్రామానికి త్వరగా చేరేలా సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం శనివారం లోతర్యతండాలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## పరామర్శ

ఖానాపూర్, మే 3 : నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన జక్కుల తరున్(సిద్ధు) రెండు రోజుల క్రితం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు గౌరికర్ రాజు, సుమన్, శ్రీనివాస్, శ్రావణ్, దివాకర్ ఉన్నారు.

# పవర్‌గ్రిడ్ పనుల పరిశీలన



పవర్‌గ్రిడ్ పనులు పరిశీలిస్తున్న చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శరవనన్, వీధి ఫౌండేషన్ సిబ్బంది

సారంగాపూర్, మే 3: నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం కౌట్ల(బీ) అటవీ ప్రాంతం పరిధిలో గల బీట్ కంపార్ట్మెంట్ నంబర్ 1024లో జరుగుతున్న పవర్‌గ్రిడ్ పనులను శనివారం చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శరవనన్ పరిశీలించారు. అనంతరం చించోలి(బీ) అర్బన్ పార్క్ పని చేస్తున్న ప్రొటెక్షన్ వాచర్లకు బ్యాగ్స్, యూఫామ్స్, షూట్, లాఠీలను విధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు శరవనన్ మాట్లాడుతూ విధి ఫౌండేషన్ వారు నిర్మల్ జిల్లాలో బుర్ధలెగిడి ఆదివాసీ గ్రామాన్ని దత్తత తీసుకున్నారని తెలిపారు. గ్రామంలో పాఠశాలకు కావాల్సిన వసతులు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, బడి మానేసిన విద్యార్థులను బడిలో చేర్పించే విధంగా కృషి చేస్తున్నారన్నారు. అలాగే నిర్మల్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడం కోసం రూ. 50వేలతో నీటి చలమలను తవ్వించామన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి నాగిని భాను, విధి ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్లు ధీరజ్, కావేరి, విజయ, టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్, మామాడ ఎఫ్ఆర్‌వో అవినాశ్, సారంగాపూర్ డీఆర్‌వో నజీర్‌ఖాన్, ఎఫ్ఎస్‌వో వేణుగోపాల్ పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించాలి

కుంటాల, మే 3 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని పైలట్ గ్రామం విట్టాపూర్‌లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ రాజేశ్వర్, ఎంపీవో, ఏపీవో ఉన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు

ఎదులాపురం, మే 3 : లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు సూచించారు. శనివారం ఆదిలాబాద్‌లోని కోర్టు ప్రాంగణంలోని ఆయన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జి కార్యదర్శి సీహెచ్ రాజ్యలక్ష్మితో కలిసి మాట్లాడారు. ఈ నెల 14న జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో రాజీపడదగ్గ కేసులు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.

## హైదరాబాద్‌లో బాలశక్తిపై ప్రత్యేక ప్రజంటేషన్

కుంటాల, మే 3 : రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాధికారులు, రీజినల్ డైరెక్టర్ల కోసం హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ సంస్థలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ బాలశక్తి కార్యక్రమంపై ప్రత్యేక ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ విషయాన్ని అధికారిక ఎక్స్‌ఖాతా ద్వారా షేర్ చేశారు. నిర్మల్ జిల్లాలో విజయవంతంగా అమలవుతున్న బాలశక్తి కార్యక్రమంలోని నాలుగు కీలక అంశాలైన హెల్త్ అండ్ వెల్‌నెస్, ఫైనాన్షియల్ లిటరసీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పోజర్ విజిట్స్‌పై విస్తృతంగా వివరించారు. అదేవిధంగా కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను కొన్ని వసతి గృహ పాఠశాలల్లో అమలు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ ఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్, జేడీ లక్ష్మీ నర్సమ్మ, ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం కార్యవర్గం

కుభీర్, మే 3 : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని పార్డి(కే) గ్రామంలో మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని కులస్తులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాతం శంకర్, ఉపాధ్యక్షుడిగా లంక పోశెట్టి, కార్యదర్శిగా బందెల దత్తు, సహాయ కార్యదర్శిగా మెంచు మహేశ్, కోశాధికారిగా గోజల హన్మాండ్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని కుల సోదరులు సత్కరించి అభినందించారు.

## టీబీ వ్యాధిగ్రస్తులకు సరుకుల పంపిణీ

ఉట్నూర్ రూరల్, మే 3 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కాటం రమేశ్ టీబీ వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సందీప్, సూపర్‌వైజర్ కృప, శ్రీరాం, వసంత్. సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐ శిక్షణతో విద్యార్థులకు మేలు

ఉట్నూర్, మే 3: ప్రభుత్వ పాఠశాలలో ఏఐ కంప్యూటర్ శిక్షణతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఉట్నూర్ మండల విద్యాధికారి రాపల్లి ఆశన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏఐ శిక్షణ తరగతులు ప్రారంభించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీకాంత్, సీఆర్పీలు పాల్గొన్నారు.

## ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, మే 3: ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత ఇంటర్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ధన్‌రాజ్ అన్నారు. శనివారం స్థానిక కళాశాలలో అడ్మిషన్ ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తా..

తాంసి, మే 3 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన అశిలీ ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను శనివారం తహసీల్దార్ లక్ష్మి పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.

## రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

ఖానాపూర్, మే 3 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ శివారులోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని ఆయా కాలనీ ప్రజలు, యంగ్‌స్టార్ యూత్ నాయకులు శనివారం తహసీల్దార్ సుజాతకు వినతి పత్రం అందజేశారు. కాలనీలో 400 కుటుంబాలు నివాసముంటున్నారని, ప్రతి నెల రేషన్ బియ్యం తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తహసీల్దార్‌కు వివరించారు. కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేసి తమ సమస్య పరిష్కరించాలని కోరారు. ఇక్కడ యంగ్ స్టార్ యూత్ అధ్యక్షుడు శేక్ షకీల్, కాలనీ వాసులు ఉన్నారు.

## అడ్మిషన్లు ప్రారంభం

దస్తురాబాద్, మే 3 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఎస్‌వో తిరుమల తెలిపారు.ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపు 20 మంది విద్యార్థులు అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఇచ్చారు. ఒక ఫొటో, పదో తరగతి హాల్‌టికెట్ నంబర్, టీసీ, బోనఫైడ్ జిరాక్స్‌లను దరఖాస్తు ఫారం వెంట జత చేయాలని సూచించారు.

## అందరి సహకారంతో అభివృద్ధికి బాటలు

కుభీర్, మే 3: అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండలాభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సాగర్‌రెడ్డి, తహసీల్దార్ శివరాజ్ పేర్కొన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కుభీర్‌లోని ఆయా కార్యాలయాలలో పలువురు మండల నాయకులు శాలువా, పూలమాలలతో వారిని వేర్వేరుగా సత్కరించారు. ఇక్కడ కుభీర్ మాజీ సర్పంచ్ పానాజీ విజయ్ కుమార్, తూము రాజేశ్వర్, శంకర్ చౌహాన్, మాజీ ఏఎంసీ చైర్మన్ సంతోష్, రాహూప్, సూది రాజన్న, కళ్యాణ్, ధర్మకిరణ్, సాయి ఉన్నారు.

# కొనుగోలు కేంద్రంలో విచారణ

కుభీర్, మే 3: నిర్మల్ జిల్లా కుభీర్‌లోని మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జొన్నల కొనుగోలు కేంద్రంలో శనివారం మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, రెవెన్యూ అధికారులతో కలిసి విచారణ చేశారు. శుక్రవారం కేంద్రానికి మహారాష్ట్ర పాసింగ్ కలిగి ఉన్న ఐచర్ వాహనం జొన్నల లోడుతో రావడంతో కొందరు రైతు నాయకులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం డీఎం, ఆర్ఐ నరేశ్ పీఏసీఎస్ సీఈవో క్రాంతికుమార్, ఏఎంసీ కార్యదర్శి గంగన్న, దడువాయి, రెండు శాఖల సిబ్బందితో పాటు జొన్నలు తీసుకువచ్చిన రైతులను విచారించారు. ఆన్‌లైన్‌లో పంట నమోదు అయి ఉంటేనే పంటలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. మహారాష్ట్ర రైతులకు సంబంధించిన జొన్నలు ఇక్కడికి తెచ్చి ఎలా అమ్ముతారని కొందరు రైతు నాయకులు నాగేందర్, కనకయ్య, డీఎంతో వాదించారు. సంబంధిత రైతు వద్ద నుంచి జొన్నలు తమ సొంత భూమిలో పండించినవేనని రాసుకున్నారు. అక్కడికి చేరుకున్న రైతులు కొనుగోలు కేంద్రాన్ని మూసివేయవద్దని ప్రాధేయపడ్డారు. దళారులు మహారాష్ట్ర నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి మద్దతు ధరకు అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు ఇక్కడికి జొన్నలు తెచ్చే వారిపై నిఘా ఉంచాలని డీఎం నిర్వాహకులకు సూచించారు.

## వడదెబ్బపై అవగాహన పెంపొందించాలి

ఇచ్చోడ, మే 3: వేసవి దృష్ట్యా వడదెబ్బ, అనారోగ్యాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. శనివారం ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మెడిసిన్ స్టోర్ స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. అవసరమైన మందులు, ముఖ్యంగా వోఆర్ఎస్ ప్యాకెట్లు, తగిన స్థాయిలో నిల్వలో ఉంచాలని సూచించారు. వోఆర్ఎస్ పని ప్రదేశాల్లో, గ్రామ పంచాయతీల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రోగులకు తగిన తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. దవాఖాన పని వేళలను కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీధర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధురిమ, సిబ్బంది పాల్గొన్నారు.

## బుద్ధ విహార్ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

జైనథ్, మే 3 : ఈ నెల 18వ తేదీన మండలంలోని లక్ష్మీపూర్‌లో జరిగే బుద్ధ విహార్ ప్రారంభోత్సవంతోపాటు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని మాజీ మంత్రి జోగు రామన్నను గ్రామస్తులు ఆహ్వానించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని కైలాష్ నగర్‌లో గల అడప తిరుపతి నివాసంలో జోగు రామన్నతో సమావేశమయ్యారు. బుద్ధ విహార్ కమిటీ సభ్యులు జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కమిటీ సభ్యులు, గ్రామస్తులు జోగు రామన్నతో బుద్ధ విహార్ ప్రారంభోత్సవ కార్యక్రమంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ఆలయ కమిటీ సభ్యులు భగత్ భీంరావ్, కామ్రే నాందేవ్, దుర్గే రాజానంద్, భీంరావ్, యోగేందర్, గ్రామ పెద్దలు అడపా తిరుపతి, అల్లూరి కల్చప్ రెడ్డి, స్వామి, దాసరి ప్రభాకర్, పంచశీల్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

తానూర్, మే 3 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని జవులా(బీ) గ్రామంలో రైతు సాతప్పపటేల్‌కు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం రైతు చేనులో విద్యుత్ తీగలకు షార్ట్‌సర్క్యూట్ అయి విద్యుత్ తీగలు ఆవుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ శాఖ ఏఈ జాదవ్ ప్రదీప్‌కు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

## ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఎదులాపురం, మే 3 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ సంద అశోక్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని టీఎన్జీవో భవనంలో సమస్యల సాధనకు ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్స్ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ఏర్పాటు చేయగా, చైర్మన్‌గా సంద అశోక్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు.

### నూతన టీజీఈజేఏసీ కార్యవర్గం..

జేఏసీ చైర్మన్ ఎస్ అశోక్ (టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు), ప్రధానకార్యదర్శిగా కే శివకుమార్ (టీజీవో జిల్లా అధ్యక్షుడు), అడిషనల్ సెక్రటరీ జనరల్‌గా కే కృష్ణకుమార్,(పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు), కో–చైర్మన్‌గా కే కిష్టన్న (టీఎస్‌యూటీఎఫ్), మూగ శ్రీనివాస్ (ఎస్‌టీయూటీఎస్), సొగల సుదర్శన్ (టీటీయూ అధ్యక్షుడు), ఎం శ్రీనివాస్ (డీటీఎఫ్), కే లక్ష్మారెడ్డి(పెన్షనర్ సంఘం అధ్యక్షుడు), బీ ప్రవీణ్ కుమార్(ఇంజినీర్స్ అసోసియేషన్) వైస్ చైర్మన్ శివకుమార్ (టీఆర్‌టీఎఫ్), నవీన్ యాదవ్(టీపీఆర్టీయూ) కాంబ్లీ విజయ్ కుమార్ (సీపీఎస్), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఏ నవీన్ కుమార్(టీఎన్జీవోస్ సెక్రటరీ జనరల్), రామారావ్ (టీజీవో), కాంబ్లీ విజయ్ కుమార్ (సీపీఎస్‌యునీస్), సెక్రటరీగా సఫదార్ అలీ(డ్రైవర్స్ అసోసియేషన్), జాయింట్ సెక్రటరీలుగా తిరుమలరెడ్డి (టీఎన్జీవోస్), కృష్ణ, సంజీవరెడ్డి (జేఎల్ఏ)లు ఏకగ్రీవంగా జేఏసీ నూతన కమిటీ ఎన్నుకున్నారు.

## భూ భారతి పైలట్ మండలంగా కుంటాల

కుంటాల, మే 3 : నిర్మల్ జిల్లాలోని కుంటాల మండలం భూ భారతి పైలట్ మండలంగా ఎంపికైనందున ఈ నెల 5 నుంచి 12 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని కుంటాల తహసీల్దార్ కమల్ సింగ్ తెలిపారు. ముగ్గురు తహసీల్దార్లు టీం లీడర్లుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహించే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఏమైనా భూ సమస్యలు ఉంటే అక్కడనే అధికారులకు అర్జీలు ఇవ్వాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్రీడలతో పాటు ఉన్నత చదువుల్లో రాణించాలి

ఇంద్రవెల్లి, మే 3: యువత క్రీడలతో పాటు ఉన్నత చదువుల్లో రాణించాలని ఎంపీ నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, కలెక్టర్ రాజర్షి షా సూచించారు. శనివారం ఇంద్రవెల్లిలోని జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులకు ఆటలపోటీల సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, పార్థసారథి, కార్యదర్శి మోతేశం పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

నార్నూర్, మే 3: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ అఖిల్ సూచించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. సమస్యలు ఉంటే నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

## జొన్న భూములు దున్నేయాలి

తాంసి(భీంపూర్), మే 3 : ఎన్నో సంవత్సరాలుగా జొన్న కోసిన తర్వాత వచ్చే లాప (కొత్తగా వచ్చే జొన్న ఆకులు) తినడం వల్ల పశువులు మృతి చెందుతున్నాయని మండల పశు వైద్యాధికారి రాథోడ్ సుభాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం జొన్న పంట ఎక్కువగా వేశారని పేర్కొన్నారు. రైతులు గమనించి వర్షాలు కురవక ముందే జొన్న భూములు దున్నేసి పశువులకు మేలు చేయాలన్నారు. పచ్చిమేత లేకపోవడం వల్ల పశువులు జొన్న చేన్లలో మేసి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, జొన్న వేసిన రైతులు పంట చేతికి వచ్చిన వెంటనే చేనును దుక్కి సహకరించాలని కోరారు

## ప్రయాణికులకు క్యూఆర్‌కోడ్ కిచెన్లు అందజేత

ఎదులాపురం, మే 3 : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందిస్తుందని ఆర్టీసీ ఇన్‌చార్జి ఆర్ఎం ప్రణీత్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు పూర్తి సమాచారం ఒకే చోట లభించేలా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన కీచైన్లను ఆరు డిపోల్లో ప్రయాణికులకు బస్టాండ్‌లో ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.

## పశుపోషకులు జాగ్రత్తలు వహించాలి

బజార్‌హత్నూర్, మే 3: పశుపోషకులు, పశుకాపారులు జాగ్రత్తలు వహిస్తూ పశువులను కాపాడుకోవాలని జిల్లా పశు సంవర్థకశాఖ వైద్యాధికారి కిషన్ సూచించారు. శుక్రవారం బుర్కపల్లి గ్రామంలో జొన్న పంట ల్యాప(హైడ్రోజన్ సనైడ్) తిని 16 ఆవులు మృతి చెందగా,మిగతా 45 ఆవులు అనారోగ్యంతో ఉండడంతో విషయం గమనించిన జిల్లా పశుసంవర్థకశాఖ (ఏడీ) స్థానిక పశు వైద్యాధికారి పర్వేజ్ హైమాద్‌తో కలిసి శనివారం బుర్కపల్లి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని రైతుల కుటుంబాల ఇళ్లలోకి వెళ్లి అనారోగ్యంతో ఉన్న ఆవుల పరిస్థితిని అడిగి తెలుసుకుని వాటికి మెరుగైన చికిత్సను అందించారు. జొన్న పంటను తీసిన వెంటనే భూమి నుంచి పూర్తిగా తొలగించాలని రైతులకు సూచించారు. వారి వెంట రైతులు, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

## పీహెచ్‌సీ తనిఖీ

గుడిహత్నూర్, మే 3 : గుడిహత్నూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలిస్తూ మందులతో పాటు ఓఆర్ఎస్ అన్ని అందుబాటులో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు..ఆయన వెంట ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, మండల వైద్యాధికారి శ్యాంసుందర్ ఉన్నారు.

## రెడ్ జోన్‌లో ఐదు మండలాలు

నిర్మల్ అర్బన్, మే 3 : నిర్మల్ జిల్లాలో రోజు రోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. పెరిగిన ఉష్ణోగ్రతల దృష్ట్యా నిర్మల్ జిల్లాలోని ఐదు మండలాలను వాతావరణ శాఖ అధికారులు రెడ్‌జోన్ ప్రకటించారు. వీటిలో నర్సాపూర్(జీ) మండలంలో 45.9 డిగ్రీలు, భైంసాలో 45.2, దస్తూరాబాద్‌లో 45.01, కుభీర్ , కుంటాల, తానూర్ 45.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని సూచించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# ఇంద్రవెల్లిలో దొంగతనం

### బంగారం, నగదు అపహరణ

ఇంద్రవెల్లి, మే 3 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోని పూలాజీబాబా ధ్యాన కేంద్రం సమీపంలో నివాసముంటున్న మండిలి బక్కన్న ఇంట్లో దొంగతనం జరిగింది. శనివారం బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. భార్యభర్తలు కలిసి మహారాష్ట్రలోని బోడిడి(సావరి)గ్రామానికి చెందిన మేనకోడలు సీమంతం కార్యక్రమానికి వెళ్లారు. శుక్రవారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. దొంగలు బీరువాను పగలగొట్టి అందులో దాచిపెట్టిన 2 తులాల బంగారం, రూ.1.50లక్షల నగదును అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సాయన్న ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వెంటనే ప్రత్యేక పోలీసు తనిఖీ బృందంను రప్పించి దర్యాప్తు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పది మంది ప్రొఫెషనల్ ఎస్ఐలు, 11 మంది రెగ్యులర్ ఎస్ఐల బదిలీలు

ఎదులాపురం, మే 3: ఆదిలాబాద్ జిల్లాలో పది మంది ప్రొఫెషనల్ ఎస్ఐలు, 11 మంది రెగ్యులర్ ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానచలనం పొందిన ఎస్ఐలు ఏ తిరుపతి (ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నుంచి డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, అటాచ్ టూ ఆదిలాబాద్ టూటౌన్), వీ పురుషోత్తం (జైనథ్ పోలీస్ స్టేషన్ నుంచి ఇచ్చోడ పోలీస్ స్టేషన్)కు, పీ దివ్యభారతి (బేల పోలీస్ స్టేషన్ నుంచి తాంసి పోలీస్ స్టేషన్)కు, కే నాగనాథ్ వీఆర్ ఆదిలాబాద్ బేలకు, డీ రాధిక (తాంసి నుంచి తలమడుగు)కు, పీ గౌతమ్ గుడిహత్నూర్ నుంచి జైనథ్ పోలీస్ స్టేషన్‌కు, బీ అంజమ్మ (తలమడుగు నుంచి డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ ఆదిలాబాద్, అటాచ్ టూ ఆదిలాబాద్ వన్ టౌన్), డీ శివరాం (సిరికొండ పోలీస్ స్టేషన్ నుంచి ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ అటాచ్), జీ అప్పారావు (ఆదిలాబాద్ హెడ్ క్వార్టర్స్ నుంచి ఉట్నూర్ పోలీస్ స్టేషన్ అటాచ్), డీ పద్మ (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఇచ్చోడ పోలీస్ స్టేషన్ అటాచ్), కే రవీందర్ ఆదిలాబాద్ టూ టౌన్ నుంచి మావల పోలీస్ స్టేషన్ అటాచ్) చేశారు.

### నెల రోజుల పాటు ఎస్‌హెచ్‌వోలుగా విధులు నిర్వహించనున్న ప్రొఫెషనల్ ఎస్ఐలు

కొమ్ము అఖిల్ (నార్నూర్ పోలీస్ స్టేషన్), గడ్డం రమ్య (జైనథ్ పోలీస్ స్టేషన్), బోడ పీర్ సింగ్ నాయక్ (భీంపూర్ పోలీస్ స్టేషన్), ఎస్ శ్రీసాయి (సిరికొండ పోలీస్ స్టేషన్), పిల్లి ప్రణయ్ కుమార్ (మావల పోలీస్ స్టేషన్), సతలపల్లి పూజ (ఉట్నూర్ పోలీస్ స్టేషన్), గడ్డల సంజయ్ కుమార్ (ఇచ్చోడ పోలీస్ స్టేషన్), కోట రాజశేఖర్ రెడ్డి (బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్), ఎస్ జీవన్ రెడ్డి (గాదిగూడ పోలీస్ స్టేషన్), యనకి మధు కృష్ణ (గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్)లో విధులు నిర్వహించనున్నారు.

## రైతు బీమాకు పంగనామాలు

కుభీర్‌: మే 3: దేశానికి అన్నం పెట్టే రైతన్నకు భద్రత కల్పించాలన్న దృఢ సంకల్పంతో గత కేసీఆర్ ప్రభుత్వం రైతు బీమాను అమలు చేసిందని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కొమ్రెవార్ అన్నారు. కుభీర్‌లో బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ బొప్ప వత్సలబాయి, నిగ్వ గ్రామంలో పోతుల సుశీలబాయి ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఆయన పరామర్శించి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుభీర్‌లో బీఆర్ఎస్ మండల నాయకుడు పోగుల పోతన్నకు చెందిన పశువుల పాక దగ్ధమైంది. ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా ఆయన బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ రైతు బీమాకు రేవంత్ రెడ్డి సర్కారు పంగనామాలు పెట్టి వారి ఉసురు పోసుకుంటుందని అన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. అందుకే పగ్గాలు చేపట్టి పట్టుమని రెండేళ్లు నిండక ముందే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోందని దీనికి మొన్నటి వరంగల్ రజతోత్సవ సభనే నిదర్శనమని అన్నారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అనిల్, మాజీ సర్పంచ్ బాబు, గోరేకర్ కాశీనాథ్, గంధం పోశెట్టి, మహేశ్, దత్తాత్రి, మధు, దత్త హరిప్రసాద్, పురంశెట్టి రవి, రావుల పోశెట్టి ఉన్నారు.

## పశువుల పాక దగ్ధం

కుభీర్, మే 3 : ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పశువుల పాక దగ్ధమైన ఘటన శనివారం నిర్మల్ జిల్లా కుభీర్‌లోని నయాబాదిలో చోటు చేసుకుంది. రైతు పొగుల పోతన్నకు చెందిన పశువుల పాక దగ్గరలో నివాసముంటున్న ఓ మహిళ చెత్తకు నిప్పుపెట్టింది. ఇది పక్కనే ఉన్న కొట్టంకు అంటుకుని మంటలు చెలరేగడంతో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. భైంసా నుంచి అగ్నిమాపక వాహనం వచ్చే వరకు మంటలు చల్లారాయి. అప్పటికే ప్రమాదంలో రేకులు, డ్రిప్ సామగ్రి, వ్యవసాయ పరికరాలు, విలువైన కలప, స్ప్రింక్లర్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. రూ.లక్ష 50వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు పంచనామా చేసి ప్రాథమికంగా అంచనా వేశారు.

## దారి దోపిడీ కేసులో నలుగురు యువకులు అరెస్ట్

ఇచ్చోడ, మే 3: దారి దోపిడీ కేసులో నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. వివరాలు.. ఈ నెల 2వ తేదీన ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ పుర్ఖాన్ అలీ ఫిర్యాదు మేరకు ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితులు నలుగురు పట్టుబడ్డారని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్ తెలిపారు. నిందితుల వివరాలు.. షేక్ సోహెలుద్దీన్, డ్రైవర్, ఇచ్చోడ, సలాం శ్రావణ్ కుమార్, అడేగం, ఇచ్చోడ, షేక్ రహిల్ షేక్ గఫార్, కిన్వట్, మహారాష్ట్ర, సలాం అలియాస్ అబ్దుల్ యాసిర్ హర్యానా దాబా వద్ద ఆగి ఉన్న లారీ అద్దాలను పగలగొట్టి బాధితుడి వద్ద నుంచి రూ.ఆరున్నర వేలు దారి దోపిడీ చేశారు. నిందితులను పట్టుకొని అరెస్టు చేశామని తెలిపారు. నిందితులపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్ నందు 141/ 2025, అండర్ సెక్షన్ 309 (4) బీఎన్ఎస్‌తో కేసు నమోదు చేశామని తెలిపారు.

## ఇచ్చోడ ఎస్ఐగా పురుషోత్తం

ఇచ్చోడ, మే 3 : ఇచ్చోడ ఎస్ఐగా పురుషోత్తం శనివారం బాధ్యతలు స్వీకరించారు. పురుషోత్తం జైనథ్ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్ఐ తిరుపతి ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కిసాన్ సేవా సమితి సేవలు అభినందనీయం

భైంసా, మే 3 : కిసాన్ సేవా సమితి సేవలు అభినందనీయమని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా భైంసాలోని కిసాన్ గల్లీలో కిసాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిసాన్ సేవా సమితి అధ్యక్షుడు అల్లకొండ సాయినాథ్, ఉపాధ్యక్షుడు కాండ్లి సాయినాథ్, క్యాషియర్ అల్లకొండ కిషన్, సభ్యులు ప్రకాశ్, బండి రవి, నగేశ్, నాయకులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు వినతి

బాసర, మే 3 : నిర్మల్ జిల్లా బాసరలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులను మోసం చేస్తున్నారని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ పవన్ చంద్రకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ బస్తాకు 41కిలోల తూకం వేయాలని కాగా 2కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నారని, కొనుగోలు కేంద్రాల్లో సంచులు కుట్టడానికి దారలు లేవని, కనీసం సంచులకు రైతుల పేర్లు రాయడానికి కలర్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

## లారీని ఢీ కొన్న బైక్ : ఒకరి మృతి

గుడిహత్నూర్, మే 3 : ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామ సమీపంలో శనివారం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందాడు. సంఘటన వివరాలు...హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బైక్‌పై ఇద్దరు వెళ్తున్నారు. మన్నూర్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని బైక్ నడుపుతున్న దీపక్‌కుమార్ వెనుక నుంచి ఢీకొట్టగా తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి... కాళ్లకు వల చుట్టుకొని..

సోన్, మే 3: సోన్ మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన సాలోకె బస్వరాజ్ (47) ప్రతి రోజూ లాగే ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి శుక్రవారం చేపలను పట్టేందుకు నీటిలోకి దిగాడు.బస్వరాజు సాయంత్రమైన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. శనివారం ఉదయం నీటిలో వెతుకుతుండగా డ్యాం నీటిలో కాళ్లకు చేపల వల చుట్టుకొని ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు సోన్ ఎస్ఐగోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నిర్మల్ అర్బన్, మే 3: పోలీసులు విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. నిర్మల్‌లోని సాయుధ దళ కార్యాలయ పరేడ్ గ్రౌండ్ నందు పోలీసు సిబ్బందికి నిర్వహించిన పరేడ్‌ను పరిశీలించారు. ఆమె వెంట ఏఎస్పీ రాజేశ్‌మీనా, సీఐలు గోవర్ధన్, ప్రేమ్ కుమార్, ప్రవీణ్, కృష్ణ, ఆర్ఐలు రాంనిరంజన్, శేఖర్, రమేశ్, రామకృష్ణ, ఎస్ఐలు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ముథోల్, మే 3 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని చింతకుంట గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పీఏసీఎస్ సీఈవో సాయారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌నాథ్ రెడ్డి, సిబ్బంది భూషణ్, రైతులు పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, మే 3: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని బిర్సాయిపేట్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, రైతులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.